ప్రభాత **జయభేరి**
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
18-06-2024
మంగళవారం
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 296 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

# పాస్ బుక్కులు రేషన్ కార్డులు ఉన్న వారికే రుణమాఫీ



**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల పంట రుణాల మాఫీపై కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రుణమాఫీ అమలుకు విధివిధానాలు ఖరారు చేయడంలో నిమగ్నమైంది. అయితే పాస్‌బుక్‌లు, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుని అవి ఉన్న వారికే రుణమాఫీ అమలు చేసేలా తాజాగా ఓ ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపన్ను చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయించాలని మంత్రిమండలి సమావేశ ఎజెండాలో ప్రతిపాదించినట్లు తెలిసింది. పంట రుణాల మాఫీపై ఈ వారంలో సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించడంతో వ్యవసాయాధికారులు రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న వారి జాబితాను బ్యాంకుల నుంచి తెప్పిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ జాబితా అధికారులకు చేరనుంది. ఈలోపు రుణమాఫీని ఎవరెవరికి అమలు చేయాలనే దానిపై వ్యవసాయశాఖ వివిధ ప్రామాణికాల ప్రాతిపదికన విస్తృతస్థాయిలో అధ్యయనం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



2 లో

# పోలవరం ప్రాజెక్టు పూర్తిగా అస్తవ్యస్తమైంది

- ప్రాజెక్టును చూస్తుంటే బాధ, ఆవేదన కలుగుతోంది
- ప్రాజెక్టుకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించిన సీఎం చంద్రబాబు



# పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

- 15 మంది ప్రయాణికులు మృతి, 60 మంది గాయాలు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వలంగా గాయపడిన బాధితులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా

**జయభేరి, కోల్ కతా జూన్ 17**

పశ్చిమ బెంగాల్ లోని రంగపాణి స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులు మృతి చెందగా, 60 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ టీమ్‌లు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి.

ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'డార్జిలింగ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు మరణించిన వార్త బాధ కలిగించింది. కాగా ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైలు ఢీకొన్న ఘటనలో మృతులకు ఎక్స్‌గ్రేషియాను పెంచారు.

దీంతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హుటాహుటిన డార్జిలింగ్ చేరుకున్నారు. ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రకటించారు. ఆ తర్వాత ఎక్స్‌గ్రేషియా పెంపును అశ్విని వైష్ణవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వలంగా గాయపడిన బాధితులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా కంపెన్సేషన్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు.



# అశ్వాపురం కేంద్రంగా బెల్ట్ దందా

- బినామీలుగా గిరిజనులు
- బాటిల్‌కు రూ.20 నుంచి 30 వరకు అదనపు రేట్లు
- గుడుంబా కి మొగ్గు చూపుతున్న మద్యం ప్రియులు
- నిద్రావస్థలో విజిలెన్స్ అధికారులు
- జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

**జయభేరి, కొత్తగూడెం, జూన్17**

వైన్ షాపు టెండరు దక్కించుకున్న లబ్ధిదారులు అంతా ఒక్కటై అశ్వాపురం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేని ప్రైవేటు స్టాక్ పాయింట్ ని ఏర్పాటు చేసుకొని బెల్ట్ షాపులకు క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు .ఒక్కొక్క వైన్ షాప్ కి వందకి పైబడి బెల్ట్ షాపులను ఏర్పాటు చేసుకొని ఈ దందా సాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాంయి.ఒక క్వాటర్ కి రూ.20 నుంచి 30 వరకు అధిక రేట్లకు అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరంలోనూ బెల్ట్ షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో గ్రామాలు, నగర శివారుల్లో ఈ దందా జోరుగా సాగేది. ప్రస్తుతం నగర నడిబొడ్డులోని కాలనీల్లో సైతం నడుస్తోంది. గతంలో గుడుంబా అమ్మకాన్ని, బెల్ట్ షాపులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించింది. ప్రభుత్వం నుంచి ఉపాధి లబ్ధి పొందిన వారు సైతం

...మిగతాది 2 లో

# ఆర్థిక మోసాలకు సగం మంది బలి

- మూడేండ్లలో 47 శాతం మంది
- యూపీఐ, క్రెడిట్ కార్డు మోసాలే ఎక్కువ



**- జయభేరి, ముంబయి :**

గడిచిన మూడేండ్లలో దేశంలో 47 శాతం మంది ఆర్థిక మోసాల బారిన పడ్డారని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. తాము లేదా తమ కుటుంబ సభ్యులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆర్థిక మోసాలకు గురైయ్యారని లోకల్‌సర్కిల్స్ సర్వేలో తేలింది. యూపీఐ, క్రెడిట్ కార్డ్ మోసాలే అధికంగా జరిగాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి 23,000 మందిని ఈ సర్వేలో భాగస్వామ్యం చేసింది. ఇందులో 62 శాతం మంది పురుషులు కాగా, 38 శాతం మంది మహిళలు ఉన్నారు. సగం మందికిపైగా తమ క్రెడిట్ కార్డులపై దేశ, విదేశీ వ్యాపారులు, వెబ్‌సైట్ సంస్థలు అనధికారిక చార్జీలను వేశారని తెలిపారు. ఇక సర్వేలో పాల్గొన్న వారిలో 43 శాతం మంది తాము లేదా తమ కుటుంబ సభ్యులు క్రెడిట్ కార్డ్

...మిగతాది 2 లో



# బీఆర్ఎస్ అధ్యక్షుడిగా హరీష్.. ప్రవీణ్..?

**జయభేరి, హైదరాబాద్, జూన్ 17:**

భారత రాష్ట్ర సమితి ఉనికి సమస్యల్లో పడింది. అసెంబ్లీ ఎన్నికల వరకూ బలంగా ఉన్న పార్టీ తర్వాత ఒక్క సారిగా వెనుకబడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలు కావడం.. తర్వాత ఐదు నెలలకే వచ్చిన లోక్ సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం భారత రాష్ట్ర సమితి నేతల్ని ఒక్క సారిగా నిరాశకు గురి చేసింది. పార్టీ భవిష్యత్ పై నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలు అంతా పక్క చూపులు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో పార్టని కాపాడుకునేందుకు కేసీఆర్ ఫామ్ హౌస్‌లో మేథోమథనం జరుపుతున్నారు. తాను గౌరవాధ్యక్షుడిగా ఉండి... ఇతరులకు బాధ్యతలివ్వాలని ఆలోచిస్తున్నారని ఈ మేరకు పార్టీ కీలక నేతలతో ఆయన సంప్రదింపులు పూర్తి చేశారని చెబుతున్నారు. భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా హరీష్ రావును నియమించాలని కేసీఆర్ అనుకుంటున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ గౌరవాధ్యక్షుడిగా తాను ఉండి నడిపిస్తానని ప్రత్యక్షంగా పార్టీ ఫేస్‌గా హరీష్ రావు ఉండాలని కేసీఆర్ అనుకుంటున్నారు. ఈ మేరకు మాజీ సీఎం తనకు అత్యంత సన్నిహితులు, సీనియర్లతో సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంతోపాటు ప్రభుత్వంలో కూడా కీలక బాధ్యతలు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీఆర్ఎస్ అధ్యక్షుడిగా హరీష్.. ప్రవీణ్..?

నిర్వర్తించిన హరీశ్‌కు బీఆర్ఎస్‌లో 'మాస్ పల్స్' తెలిసిన నాయకుడిగా పేరుంది. కేటీఆర్ కాకుండా హరీషే ఎందుకు అన్న ప్రశ్న కూడా వస్తుంది. అయితే కేటీఆర్ కన్నా హరీష్ రావే ప్రస్తుతం మంచి చాయిస్ అనుకుంటున్నారు. గతంలో హరీష్ రావును నిర్లక్ష్యం చేశారన్న ప్రచారం జరిగింది. అందుకే తరచూ ఆయన పార్టీ మారబోతున్నారన్న పుకార్లు వస్తున్నాయి. అయితే హరష్ రావు మాత్రం ఎప్పుడూ అలాంటి పుకార్లకు బలం ఇచ్చేలా వ్యవహరించలేదు. కేసీఆర్ చెప్పింది చేస్తూ వెళ్లారు. పార్టీ వ్యవహారాల్లో కేటీఆర్ చాలా కీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ ఆయన కన్నా.. ప్రస్తుత పరిస్థితుల్ని హరీష్ రావే చక్కదిద్దగలరని కేసీఆర్ గట్టి నమ్మకంగా ఉన్నారని చెబుతున్నారు. ఒక వేళ హరీష్ రావును అధ్యక్షుడిగా చేయలేకపోతే కేసీఆర్ మరో ఆలోచన చేస్తున్నారు. అదే దళిత అధ్యక్షుడు. తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకోలేదు. దీనిపై ఇప్పటికీ ఇతర పార్టీల నేతలు విమర్శలు చేస్తూంటారు. ఈ కారణంగా బీఆర్ఎస్‌కు దళిత ఓటు బ్యాంక్ పెద్దగా లేదన్న అభిప్రాయం ఉంది. ఈ మైనస్‌ను చెరుపుకోవడంతో పాటు దళిత ఓటు బ్యాంక్‌ను సాధించేందుకు ప్రవీణ్ కుమార్‌నే అధ్యక్ష స్థానంలో కూర్చోబెడితే 'ఉభయ తారకం'గా ఉంటుందన్న కోణంలోనూ కేసీఆర్ సమీకరణాలు లెక్కపై చర్చలు జరుగుతున్నాయంటున్నారు. ఇలా ముందుకెళితే గతంలో ఉన్న మచ్చను పోగొట్టుకోవచ్చు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను మళ్లీ దగ్గర చేసుకోవచ్చనే వ్యూహంతో కేసీఆర్ ఉన్నారు. ప్రవీణ్ కుమార్‌కు దళిత వర్గాల్లో ఆదరణ ఉంది. స్వేరో పేరుతో ఆయన ఓ దళిత యువత తో కూడిన సైన్యాన్ని కూడా నడిపిస్తున్నారు. హరీష్ రావు లేకపోతే ప్రవీణ్ కుమార్‌లను అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి తాను గౌరవ అధ్యక్షుడిగా రాజకీయాలను నడిపే అవకాశాలపై ఇప్పుడు తీవ్ర స్థాయిలో చర్చిస్తున్నట్లు తెలంగాణ భవన్ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బలంగా ఉండేది. ఆ బలం అధికారంలో ఉండటం వల్ల వచ్చి చేరిన నేతల వల్ల వచ్చింది. బీఆర్ఎస్ అసలుబలం.. తెలంగాణ ఉద్యమం.. తెలంగాణ సెంటిమెంట్. కానీ రాజకీయంగా బలపడే ప్రయత్నంలో కేసీఆర్ ఇలాంటి ఉద్యమకారుల్ని చాలా మందిని దూరం చేసుకున్నారు. హరీష్ రావు లేదా ప్రవీణ్ కుమార్‌లకు బాధ్యతలు ఇస్తే వారిలో చాలా మంది వెనక్కి తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే తెలంగాణ సెంటిమెంట్ పూర్తిగా తగ్గిపోయిన సమయంలో ఉద్యమ నేతలు ఎందుకు వెనక్కి వస్తారని.. ఏ పార్టీలో కంఫర్ట్ గా ఉంటే అక్కడే ఉంటారని.. రాజకీయ భవిష్యత్ ఉందనిపిస్తేనే ఎవరైనా వస్తారని.. అలాంటి అవకాశం ఉందని ఆశలు కల్పించాల్సి ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. అయితే కేసీఆర్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుని హరీష్ రావు లేదా ప్రవీణ్ కుమార్‌లకు ఇస్తారంటే... కేసీఆర్ మార్క్ రాజకీయాలను దగ్గరగా చూసిన వారు నమ్మడం లేదు. గతంలో ఎదురు దెబ్బలు తగిలినప్పుడల్లా కేసీఆర్ తాను రాజీనామా చేస్తానని ప్రకటించేవారు. ఆయనే ఉండాలని పార్టీ క్యాడర్ ఉద్యమం చేసేది. చివరికి క్యాడర్ కోరిక మేరకు తానే అధ్యక్షుడిగా ఉంటున్నానని ఆయన ప్రకటించేవారు. ఈ సారి కూడా అలాంటిదేదో జరుగుతోందని కొంత మంది నమ్ముతున్నారు. ఆయన వైదొలగాలంటే ఇంత చర్చ పెట్టేవారు కాదని చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, ఉద్యమ సహచరులతోపాటు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో లోతైన చర్చలు కొనసాగిస్తున్నారు. తన ఆలోచన బయటకు తెలియాలని.. తననే కొనసాగాలని పార్టీ క్యాడర్ నుంచి ఒత్తిడి రావాలన్న వ్యూహంతోనే కేసీఆర్ ఇలా చేస్తున్నారని .. తాను చర్చిస్తున్న వారి ద్వారా బయటకు తెలియాలనే వ్యూహమని అనుమానాలు కూడా ఉన్నాయి. త్వరలోనే పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఆ సమావేశంలో పార్టీ పూర్వ వైభవం కోసం తాను తీసుకోబోతున్న చర్యలేమిటో వివరించే అవకాశం ఉంది. అందులోనే కేసీఆర్ వైదొలుగుతారా లేకపోతే.. ఆయనే కొనసుగుతారా అన్నదానిపై స్పష్టత వస్తుంది.

## బెల్ట్ దందా..

బెల్ట్ దందాను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదంతా వైన్ షాపుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపులు లిక్కరు దందాను కొనసాగించేందుకు బెల్ట్ షాపులను వారే ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది. వైన్ షాపులు సరుకు చేరవేస్తూ దానిపై కమీషన్లు ఇస్తూ కొత్త తరహాలో బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దందాను కట్టడి చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం పినపాక నియోజకవర్గం లోని పల్లెల్లో, మారుమూల గ్రామాలలో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంటోంది. గుడుంబా తయారీదారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. చీప్ లిక్కర్ అధికంగా ధరలు పెరగటం పెరగడంతో నియోజకవర్గంలోని మద్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మల్లుతున్నారు. గుడుంబా కేవలం గ్రామాలు పల్లెలు, పరిమితం కాకుండా పట్టణాలకు సైతం పాకింది.సరుకు భారీగా తీసుకువస్తూ అమ్మకాలు జరుపుతున్నారు. ఇదంతా ఎక్సైజ్, పోలీసు శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే దందా సాగుతుందనే విమర్శలు వస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాలే కాకుండా జిల్లా నలుమూలాల గుడుంబా, దేశిదారు అమ్మకాలు జోరుగా సాగుతుండడంతో జిల్లాలో మద్యం అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మద్యం వ్యాపారులు సైతం చెబుతుండడం గమనార్హం. గుడుంబా, దేశిదారు సరఫరాపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు మూలాలపై దృష్టిపెట్టకుండా అడపాదడప దాడులు చేస్తూ అమ్మకందారులకు అడ్డుకట్టవేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులు నిద్రావస్థ నుండి మేల్కొని ప్రజలను కాపాడాలని,దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు ప్రజాసంఘాలు కోరుకుంటున్నారు.

## ఆర్థిక మోసాలకు సగం మంది బలి

లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామన్నారు. పట్టణాల్లో మోసపోయిన ప్రతీ 10 మందిలో నలుగురు చెల్లింపును అంగీకరించడానికి పంపిన లింక్ లేదా క్యూఆర్ కోడ్ వల్ల వారి ఖాతా నుంచి తెలియకుండానే డబ్బు బదిలీ అయ్యిందని తెలిపారు. గత మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లో ప్రతీ ఇద్దరిలో ఒక్కరు అనధికార చార్జీలకు గురైయ్యారు. ఇలాంటి మోసాలను ఎదుర్కొన్నట్లు 53 శాతం మంది పేర్కొన్నారు. లోకల్ సర్కిల్స్ రిపోర్ట్ ప్రకారం.. ఆర్‌బీఐ, యూపీఐ, క్రెడిట్ కార్డులు జారీ చేసే బ్యాంకులు ఇలాంటి ఆర్థిక మోసాలను నిరోధించేందుకు మరిన్ని రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధ్యయనంలో తేలింది. దేశంలోని వేలాది మంది డేటా విక్రేతల ద్వారా వినియోగదారుల క్రెడిట్ కార్డ్ డేటా సులభంగా అమ్మకానికి అందుబాటులోకి వచ్చిందని లోకల్ సర్కిల్స్ తెలిపింది. పాన్ కార్డ్, ఆధార్, మొబైల్ నంబర్, ఈమెయిల్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారం అమ్మకానికి డేటాబేస్‌లలో సులభంగా అందుబాటులోకి వచ్చిం ది. దీంతో ఆర్థిక మోసగాళ్లు సులభంగా ప్రజలను బురిడి కొట్టిస్తున్నారని వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం 2023 24లో బ్యాంకింగ్ మోసాలు రికార్డ్ స్థాయిలో 300 శాతం పెరిగి 36,075కు చేరాయని ఇటీవల ఆర్‌బీఐ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. గత రెండేండ్లలో మొత్తం సైబర్ మోసాలు 700 శాతం పెరిగాయని వెల్లడించింది. 202122లో 3,596 కార్డ్, ఆన్‌లైన్ మోసాలు జరిగితే, 202324లో ఆ సంఖ్య 29,082కు పెరిగింది.

## మహిళా రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

✍ జయభేరి, ఆదిలాబాద్:

ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ హత్య కేసులో ప్రధాన నిందితురాలు, రిమాండ్ ఖైదీ విజయలక్మి ఆత్మహత్య యత్నం చేసింది. జిల్లా జైలులో షేవింగ్ బ్లేడ్ లు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. జైలు అధికారులు ఆమెను అత్యవసర చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

# చంద్రబాబును చూసి నేర్చుకోండి

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 17:



పింఛన్ల పెంపు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని చూసైనా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేర్చుకోవాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు చెప్పినట్టే చంద్రబాబు నాయుడు రూ.4 వేలకు పింఛన్లు పెంచారని.. ఆ మేరకు మొదటి సంతకం పెట్టారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చెప్పిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. ఏపీని చూసైనా నేర్చుకోవాలని.. రూ.4 వేల పింఛన్లు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పక్షాన, గ్రూప్స్ అభ్యర్థుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఆరు నెలల్లో చెప్పిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కారు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు,కాగా తాను పార్టీ మారుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని హరీష్ రావు స్పష్టంచేశారు. తాను కాంగ్రెస్, బిజెపిలో చేరుతున్నానంటూ ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ థంబ్స్ పెట్టి కావాలనే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇకపై ఇలాగే తప్పుడు వార్తలు రాస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.
వ్యూస్ కోసం ఓ నాయకుడి నిబద్ధతను, నిజాయతీని దెబ్బతీయొద్దని మీడియాకు హితవుపలికారు. అలాంటివి మానుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని ఘాటుగా చెప్పారు.సంచలనాల కోసం తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్‌లో చేస్తున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ మంత్రి హరీశ్‌రావు. "వర్కింగ్ ప్రెసిడెంట్‌ను అయ్యానని, కాంగ్రెస్‌లోకి, బీజేపీలోకి వెళ్తున్నానని ఏవేవో చెబుతున్నారు. దయచేసి ఇలాంటి పెట్టకండి. లైక్స్, వ్యూస్ కోసం నాయకుడి నిబద్ధత, నిజాయితీని దెబ్బతీయకండి. ఇలాంటివి మానుకోకపోతే లీగల్ చర్యలు తీసుకోడానికి వెనుకాడబోం." అని అన్నారు.

అంతకంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై మండిపడ్డారు. "గ్రూప్ 1, గ్రూప్ 2 అభ్యర్థులు, నిరుద్యోగులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ఛైర్మన్ దగ్గరికి వెళ్తే ప్రభుత్వం చేతుల్లోనే అంతా ఉందంటున్నారు. ప్రజా దర్బార్‌కు వెళ్లి కాళ్లమీద పడ్డా కనికరించడం లేదు. నిరుద్యోగులకు మాట ఇచ్చిన కోదండరామ్ దగ్గరికి వెళ్లినా స్పందన లేదు. కొత్త హామీలను కాకుండా మీరు ఇచ్చిన హామీలన అమలు చేయమని కోరుకుంటున్నారు." "కాంగ్రెస్ నిరుద్యోగులకు లేనిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడెందుకు మాట తప్పుతోంది? నిరుద్యోగుల తరపున 5 డిమాండ్లు ప్రభుత్వం ముందు పెడుతున్నాం. గ్రూప్ 1కు 1:100 చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలి. గ్రూప్ 2కు 2వేలు, గ్రూప్ 3కి 3 వేల ఉద్యోగాలు కలుపుతామన్న మాట నిలబెట్టుకోవాలి. పరీక్షల మధ్య 2 నెలల గ్యాప్ ఉండాలి. జులైలో డీఎస్సీ నిర్వహిస్తున్నారు. వెంటనే ఆగస్టు 7,8న గ్రూప్ 2 ఉంది. 7 రోజుల గ్యాప్ ఉందన్న ఒత్తిడితో సంగీత అనే అమ్మాయి సూసైడ్ చేసుకుంది. ఏడాదిలోగా 2 లక్షలు ఉద్యోగాలతో జాబ్ కేలండర్ ఇస్తామన్నారు. ఆరునెలలైనా ఇంకా ఎందుకివ్వలేదు? 25 వేల పోస్టులతో ఇస్తామన్న డీఎస్సీ 11 వేల పోస్టులతో ఎందుకు ఇచ్చారు. మొత్తం 25 వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహించాలి. నిన్నమొన్న వచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు వేల రూపాయల పింఛన్ ఇచ్చింది. పాత బకాయిలను కూడా కలిపి ఇస్తోంది. ఇక్కడ ఆరు నెలలైనా ఎందుకు 4 వేల రూపాయల పింఛన్ ఇవ్వడం లేదని హరీష్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చే పింఛన్ కూడా ఎందుకివ్వడం లేదని నిలదీశారు. "ఇంటికి 2 పింఛన్లు ఇస్తామని ఎందుకు అమలు చేయడం లేదు. పేదల పట్ల ఎందుకీ నిర్లక్ష్యం? ఏపీలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి పింఛన్ పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యమైంది ఇక్కడెందుకు సాధ్యం కావడంలేదు. ఏపీని చూసి అయినా నేర్చుకోండి. ఒక్కొక్కరికి 12 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడింది. ఈ నెలకు కలిపి మొత్తం 16 వేలు ఇవ్వాలి.""ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామన్న ప్రభుత్వం మాట తప్పింది. ఎన్ హెచ్ఎం, ఆశావర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీట్‌లో గ్రేస్ మార్కుల విధానమే లేనప్పుడు ఎలా కలిపారు? ఫలితాలను పది రోజులు ముందుకు జరిపి, పార్లమెంటు ఫలితాల రోజే ఎందుకు విడుదల చేశారు? ఎన్నో అనుమానాలున్నాయి. దీనిపై ప్రభుత్వం సీబీఐ, ఈడీ విచారణ ఎందుకు జరపడం లేదు? పేపర్ లీక్ కాకపోతే బిహార్, గుజరాత్‌లో ఎందుకు అరెస్టులు జరుగుతున్నాయి? తెలుగు విద్యార్థులకు అన్యాయం జరక్కుండా బీజేపీ ఎంపీలు, మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి స్పందించాలి. ఇంత ప్రధాన సమస్యపై మీరెందుకు మాట్లాడ్డం లేదు?


# పోలవరం ప్రాజెక్టు పూర్తిగా అస్తవ్యస్తమైంది

- ప్రాజెక్టును చూస్తుంటే బాధ, ఆవేదన కలుగుతోంది
- ప్రాజెక్టుకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించిన సీఎం బాబు

✍ జయభేరి, పోలవరం, జూన్ 17:

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుని సందర్శించి సమీక్షి నిర్వహించిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిగా అస్తవ్యస్తమైందని కీలక ప్రకటన చేశారు. ప్రాజెక్టును చూస్తుంటే బాధ, ఆవేదన కలుగుతోందని, పోలవరం ప్రాజెక్టుని ఏపీకి జీవనాడిగా భావించామని పేర్కొన్నారు.2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత దూరదృష్టితో పోలవరం ముంపు ప్రాంతంలోని తెలంగాణాకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయించామని చంద్రబాబు గుర్తుచేశారు. నాటి ఎన్డీయే2 కేబినెట్ ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయగలిగామని చంద్రబాబు ప్రస్తావించారు. అప్పటికే పోలవరం ప్రాజెక్టు చాలా సంక్షోభాల్లో ఉందని, 2005లో వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టు పనులపై అప్పటికే అనేక ఆరోపణలు వచ్చాయని గుర్తుచేశారు. కాగా రాష్ట్ర విభజన తర్వాత పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారని చెప్పారు.ఇక డ్యామ్ ఎత్తు 45.72 మీటర్ల డ్యాం ఎత్తు ఉంటే 194 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, ఆ ఎత్తును తగ్గించడానికి ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. స్పిల్ వే ద్వారా 50 లక్షల క్యూసెక్కుల నీరు వెళ్లేలా డిజైన్ చేశామని, చైనాలో త్రీ గార్జియస్ ప్రాజెక్టు ద్వారా మాత్రమే అంత ఎక్కువ వాటర్ డిశ్చార్జి అవుతోందని పేర్కొన్నారు.

**అలాంటోళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలా ఉంటుంది..**




రాజకీయాల్లో ఉండ తగని వ్యక్తి రాజకీయాల్లోకి వస్తే ఇలాగే జరుగుతుందని మాజీ సీఎం జగన్‌పై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఆయన రావడం తప్పు కాదు. క్షమించరాని నేరం. అప్పటి నా కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారు. వైసీపీ ప్రభుత్వం రావడమే రివర్స్ టెండరింగ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు రోజుల్లోనే కాంట్రాక్టు ఏజెన్సీని మార్చేశారు. 2020 వరదల్లో డయాఫ్రం వాల్ 35 శాతం పాడయ్యింది. రూ.480 కోట్లతో అత్యవసరంగా నిర్మిస్తే దానిని అలా చేశారు" అని వివరించారు.

# ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 17:

తెలంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను సవరించాలని నిర్ణయించింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, స్థిరాస్తుల కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు చేయనుంది. రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే క్షేత్రస్థాయిలో విలువను అంచనా వేసేందుకు స్టాపులు-రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాచరణ ప్రారనంభించింది. పాత విలువను సవరించి కొత్త విలువను అమలులోకి తెచ్చేందుకు ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. జూన్ 18న అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ఈ శాఖ అధికారులు ప్రాథమిక సమావేశం నిర్వహించి కార్యక్రమం ప్రారంభిస్తారు.దశలవారీగా పరిశీలన పూర్తిచేసి జూలై 1న కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు ఖరారు చేస్తారు. మండల, జిల్లా స్థాయిలోని కమిటీల పరిశీలన అనంతరం ఆగస్టు నుంచి కొత్త మార్కెట్ విలువలు అమలు చేసేలా స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**మార్గదర్శకాలు జారీ..**

గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల వారీగా మార్కెట్ విలువల సవరణ సందర్భంగా అనుసరించాల్సిన మార్గదర్శకాలను శనివారం స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే-లాయండ్ రికార్డ్స్, పురపాలక శాఖ నుంచి సహకారం తీసుకోవాలని సూచించారు.

**గ్రామాల్లో కసరత్తు ఇలా..**

జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. అక్కడ వ్యవసాయేతర వినియోగానికి అనువైన ప్రాంతాలు, పరిశ్రమలు, సెజ్‌లు తదితర ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ భూముల ధరలను లెక్కలోకి తీసుకుని మార్కెట్ విలువ నిర్ణయిస్తారు.భూముల ధరలు క్రమంగా పెరగడం లేదా తగ్గుతుండడాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తారు. జిల్లా రిజిస్ట్రార్లు, డీఐజీలు ఆ రీతులను గుర్తిస్తారు.వ్యవసాయ భూముల విషయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారుల సూచనలు తీసుకుని బహిరంగ మార్కెట్ ధరలపై అంచనాకు వస్తారు.

**పట్టణ ప్రాంతాల్లో ఇలా..**

ఇక మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో స్థానిక ప్రాంతాలను అనుసరించి విలువను నిర్ధారిస్తారు. వాణిజ్య ప్రాంతాలు, ప్రధాన రహదారుల లాంటి ఏరియాల్లో ఆ ప్రాంతానికి అనుగుణంగా విలువను నిర్ణయిస్తారు. కాలనీలు, అంతర్గత రహదారుల ప్రాంతాలు, మౌలిక వసతులు-అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనూ పాత విలువతో పోల్చి అవసరమైతేనే సవరిస్తారు. పెంపు లేదా తగ్గింపు కూడా చేసే వీలు ఉంది. పురపాలక, నగరపాలక సంస్థల్లో కొత్తగా చేరిన గ్రామాల్లో స్థానిక విలువను బట్టి క్షేత్రస్థాయి ధరలను ప్రతిబింబించేలా సవరణ చేస్తారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్న ఆయా శాఖల నుంచి రావాల్సిన బకాయిలు సమీకరిస్తున్నారు. ఈ క్రమంలో భూముల విలువ పెంపుపైనా దృష్టి పెట్టారు. భూముల విలువ పెంచడం ద్వారా రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఖజానాకు వచ్చే ఆదాయంలో మద్యం మొదటి స్థానంలో ఉండగా, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తర్వాతి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలోనే భూముల విలువ పెంచాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. తద్వారా భారీగా ఖజానాకు నిధులు వస్తాయని అంచనా వేస్తోంది.భూముల విలువ పెంపు విషయంలోనూ రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మూడు నాలుగుసార్లు భూముల విలువలు సవరించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది కానీ, సామాన్యులకు ఎలాంటి లబ్ధి కలుగలేదు. దీంతోపాటు ల్యాడ్ టైటిలింగ్ యాక్ట్ అమలు కూడా మొన్నటి ఎన్నికల్లో జగన్ ఓటమికి కారణమయ్యాయి.

**విలువ ఉన్న ప్రాంతాల్లో పెంచాలి..**

భూముల విలువ పెంపు అంటే .. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే పెంచాలి. డిమాండ్ లేని ప్రాంతాల్లో భూముల విలువ పెంచితే అది ప్రభుత్వంపై వ్యతిరేకతకు దారి తీస్తుందని నిపుణులు అంటున్నారు. ఇందుకు జగన్ చేసిన ప్రయోగమే నిదర్శనమంటున్నారు. జూన్ 15 లేదా 18న నిర్వహించే కేబినెట్ మీటింగ్‌లో భూముల విలువలు సవరించే అవకాశం ఉందని తెలుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**షెడ్యూల్ ఇదీ..**

జూన్ 18న రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, సర్వే అధికారులతో సమావేశం. జూన్ 23న మార్కెట్ విలువల సవరణ పూర్తి. జూన్ 25న పునః సమీక్ష. జూన్ 29న కమిటీ ఆమోదం. జూలై 1న వెబ్‌సైట్‌లో సవరించిన విలువల ప్రదర్శన. జూలై 20 వరకు సలహాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం. జూలై 31న శాఖ వెబ్‌సైట్‌లో కొత్త ధరల అప్‌డేషన్. ఆగస్టు 1 నుంచి సవరించిన ధరలు అమలు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందితే అంతా శుభమే

» దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**జయభేరి, చింతపల్లి :**
శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో అంతా శుభమే జరుగుతుందని, శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో తరించి స్వామివారి అనుగ్రహం పొందాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. సోమవారం చింతపల్లి మండలం వింజమూరు గ్రామపంచాయతీ పరిధిలోని వైపి నగర్ వద్ద గల శ్రీ శ్రీ హరి హర క్షేత్రం మొదటి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, తన అనుచరులతో కలిసి క్షేత్రాన్ని సందర్శించి శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు శ్రీశ్రీ చినజీయర్ స్వామి గారి దివ్య మంగళ ఆశీస్సులతో శ్రీమాన్ హనుమాన్ దీక్షితులు చేత మొదటి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా కనుల పండుగ నిర్వహించారు.





కలియుగ హరిహర క్షేత్రం ఆవరణలోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాసరావు, సుధా, కావేటి వంశీ, సుష్మ దంపతులచే నిర్వహించగా, వారిచే సోమవారం ప్రత్యేక పూజలతో పాటు చక్రస్నానం, హోమం నిర్వహించారు.
ఆలయ కమిటీ నిర్వాహకులు మొదటి వార్షిక బ్రహ్మోత్సవానికి అన్ని రకాల వసతులను సమకూర్చి కన్నుల పండుగగా కార్యక్రమాలను చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అన్ని రకాల పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మూడు రోజులు పాటు క్షేత్ర ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని, శనివారం నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాసరావు కావేటి వంశీ తెలిపారు. బ్రహ్మోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాసరావు, సుధ, కావేటి వంశీ, సుష్మ, తెరటిపల్లి గురునాథం, విజయమ్మ, నరేందర్, యాదమ్మ, గ్యార వెంకటయ్య, కొరివి రాధాకృష్ణ తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

**జయభేరి, కాప్రా :**
కాప్రా మసీద్ లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోంది అని దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం,ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులుతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరి సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ BRS పార్టీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ బద్రుద్దిన్, BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, రహీమ్ ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలము కేటాయించాల్సిందిగా కోరుతూ వినతి పత్రం



**జయభేరి, ఉప్పల్ :**
గోశాల, యోగశాల స్థల కేటాయింపు విషయంలో పూర్తి సహకారం అందిస్తా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తపస్య ఫౌండేషన్ ఉప్పల్ ఆచార్యవేద సింధు, బొల్లా విజయ్ కుమార్ తో కలిసి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి గోశాల, యోగశాల గురించి ప్రభుత్వ స్థలము కేటాయించాల్సిందిగా కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సానుకూలుగా స్పందిస్తూ వెంటనే తన లెటర్ హెడ్ ద్వారా కలెక్టర్ కి దరఖాస్తు చేస్తానని, ప్రభుత్వం స్థలం కేటాయించే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో మహేందర్ జైస్వాల్, పత్తిపాక లక్ష్మణ్, గంగాధర్ మహాజన్, మొదలగు వారు పాల్గొన్నారు.

## వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం



**జయభేరి, ఉప్పల్ :**
కాలనీలలో పలుసమస్యలపై పర్యటించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. రామాంతపూర్ డివిజన్, సత్యానగర్, రవిందర్ రెడ్డి నగర్, లక్ష్మి శ్రీకాంత్ నగర్, శ్రీనగర్ కాలనీలలో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. డివిజన్ పరిదిలోని కొత్తగా ఏర్పడ్డ పలు కాలనీల సమస్యలు సరైన రోడ్లు, డ్రైనేజ్ పైపులైన్లు, మంచినీరు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే కి వారి సమస్యలను తెలుపగా.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యముగ కాలనీలో డ్రైనేజ్ పైపులైన్, రోడ్లు, తాగునీరు సమస్యలను పరిష్కరించటంతో పాటు, పారిశుద్ధ నిర్వహణ మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, కాలనీ లో సమస్యలు ఉంటే తన దృష్టికి తిసుకువస్తే వెంటనె పరిష్కరించేందుకు చర్యలు తిసుకుంటామన్నారు. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు, శంకర్ అన్న, సురం శంకర్, మహేందర్, సంద్య, లక్ష్మి, సాగర్, ప్రశాంత్ గౌడ్, మందపాటి శ్రీనివాస్ రెడ్డి, మద్దురి శ్రీనివాస్, విజయలక్ష్మి, ముత్యాల మధు, ప్రవీణ్, సంతోష్, కాలనీ వాసులు కృష్ణ రెడ్డి, వెంకట చారి, సతీష్, పందు, సోమయ్య, రమేష్, ధనుంజయ్, సిద్ధిరాములు, తదితరులు పాల్గోన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కలిసిన మల్కాజ్ గిరి ఎమ్మెల్యే

» ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కేసీఆర్



**జయభేరి, జూన్ 17:**
మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మర్రి రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం కాసేపు వారు ముచ్చటించారు.



## యువకుడు అదృశ్యం

**జయభేరి, మేడ్చల్ :**
కుటుంబికులకు చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని దర్వారీ గ్రామానికి చెందిన సంఘం కుమార్ చౌబే గత కొంత కాలం క్రితం భార్యతో కలిసి మేడ్చలకు వలసవచ్చి పట్టణంలోని సరస్వతి కాలనీలో నివాసం ఉంటూ ట్రాన్స్పోర్ట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్ శివాను చౌబే (18) వారి స్వగ్రామంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఈ నెల 1న తన తల్లితో కలిసిమేడ్చలకు వచ్చిన శివాను చౌబే తిరిగి తాను స్వగ్రామానికి వెళ్లిపోతానని తండ్రికి తెలిపాడు. కుమారుడిని స్వగ్రామానికి రైలులో పంపేందుకు టిక్కెట్ దొరకకపోవడంతో రెండు రోజుల తర్వాత ఇంటికి వెళ్లాలని తండ్రి కుమార్ చౌబే కుమారుడికి చెప్పాడు. కాగా ఈ నెల 14న తెల్లవారుజామున ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన శివాను తిరిగి ఇంటికి రాకపోవడంతో స్వగ్రామానికి చెప్పకుండా వెళ్లి ఉండవచ్చని భావించి బందువులను ఆరా తీయగా అక్కడికి చేరుకోలేదు. దీంతో తమ కుమారుడు తప్పిపోయాడని తండ్రి మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంపీ ఈటలను కలిసిన నాయకులు



**జయభేరి, మేడ్చల్ :**
మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను సోమవారం మేడ్చల్ అగ్రి ప్రోఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఎంఏపీఏ అసోసియేషన్ అధ్యక్షులు రవి ఆధ్వర్యంలో మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. అసోసియేషన్ భవనం ఏర్పాటుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేసి కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ స్థల పరిశీలన చేయాలని భవనం ఏర్పాటుకు సహకారం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవి ,సత్తిరెడ్డి, కేవి రావు, రవీంద్ర, సదనాస్, అమిత్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా బైండ్ల కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

» మాల మాదిగ ఉప కులాలతో పాటు బైండ్ల కులాన్ని 3వ కులంగా గుర్తించాలని వక్తల డిమాండ్



**జయభేరి, జూన్ 17:**
ఎస్సీ కులాల్లోని మాల, మాదిగ ఉపకులాలతో పాటు బైండ్ల కులాన్ని కూడా 3వ కులంగా ప్రత్యేకంగా గుర్తించాలని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి రాంచందర్ అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ లోని సంగీత్ ఫంక్షన్ హాలులో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బైండ్ల కుల సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షునిగా బైండ్ల రాంచందర్, ఉపాధ్యక్షునిగా బైండ్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా నర్సింలు ను ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందచేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాల్లోని మాల మాదిగ ఉపకులాలుగా ఏ విధంగా పిలవబడుతున్నాయో అదే విధంగా బైండ్ల ఉపకులంగా బైండ్లను గుర్తించాలని కోరారు. ఇక ఎస్సీ కులాల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ ను 15 నుంచి 20శాతానికి పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి రామకృష్ణ, సలహాదారులు బైండ్ల కుమార్, సంజీవరావు, నర్సింహా, శ్రీను, సునీల్, రమేష్, బాలనర్సింహా, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**జయభేరి, దేవరకొండ :**
పూరి జగన్నాథ్ శ్రీకృష్ణ రథయాత్ర జూలై 10 వ తారీకు మన దేవరకొండకు రానున్నడంతో రథయాత్రను విజయవంతం చేయడం కోసం సోమవారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోస్టర్లు, కరపత్రంలు ఆవిష్కరించి పంచడం జరిగినది దేవరకొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామము నుండి శ్రీకృష్ణ రథయాత్రకు భక్తులను అధిక సంఖ్యలో తరలిరావాలని అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు కొనియాడారు.
ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రథయాత్ర నిర్వహణ ఏర్పాట్లు చందాల పై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిటీలకు రసీదు పుస్తకాలను అందించారు.
అదేవిధంగా ఈ పూరి జగన్నాథ రథయాత్రలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కోలాటాలు, వివిధ నృత్యాలతో కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కార్యదర్శి నక్క వెంకటేష్ యాదవ్, కోశాధికారి పెండ్కర్ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, తాడిశెట్టి సుదర్శన్, వాసవి కళ్యాణ మండపం అధ్యక్షులు వాస వెంకటేశ్వర్లు, నీల సంజీవ్ కుమార్, షిరిడి సాయిబాబా దేవాలయం అధ్యక్షులు ఇల్లందుల శ్రవణ్ కుమార్, ఉప్పల శ్రీనివాసులు (చంటి) సిరిపోతు శ్రీరాములు, మహిళా కమిటీ చైర్మన్ చేరుపల్లి జయలక్ష్మి, కో చైర్మన్ గోవిందు శైలజ, అధ్యక్షులు గుమ్మడవెల్లి మహాలక్ష్మి, కార్యదర్శి మోర శ్రీదేవి, కోశాధికారి బెలిదే మాధవి, పంగునూరు లింగయ్య, సముద్రాల ప్రభాకర్, కర్నాటి జనార్ధన్, శీల ధర్మయ్య, ఎన్ ఎన్ చారి, నేతల వెంకటేష్ యాదవ్, కొత్త సుబ్బారావు, చీదర్ల శ్రీదేవి, చిలువేరు ముత్తమ్మ గార్లపాటి రజిని, శీల ధనలక్ష్మి, సముద్రాల రేణుక, కుంచకూరి శిరీష, తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

జయభేరి, దేవరకొండ :

బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. దేవరకొండ పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు నూతన వస్త్రములు ధరించి పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక ప్రార్ధనలు చేశారు. పిల్లలు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్ద ఫారుక్ మౌలానా ఆధ్యాత్మిక ప్రాంగణం చేస్తూ ఇస్లాం మతం గురించి,( ఈదుల్ అద్హ ) బక్రీద్ యొక్క ప్రాముఖ్యత మరియు హజరత్ ఇబ్రహీం అలైహి సలాం యొక్క త్యాగాల గురించి గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వార్థం,అసూయ,రాఘద్వేషాలలో విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరాతిని వ్యాప్తి చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్తమమైనదని బక్రీద్ ముఖ్య ఉద్దేశం ఇదే అని అన్నారు. హజరత్ ఇబ్రహీం త్యాగానికి స్మరించుకుంటూ, సమైక్యతను మానవత్వాన్ని త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ స్పూర్తి అని అన్నారు. సమాజంలో వివిధ అంశాలలో కుర్బానీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఇది పేద ప్రజలను సంతృప్తి పరుస్తుందని ముస్లింలను ఏకం చేసి సర్వశక్తిమంతుడైన అల్లాకు లొంగిపోయేలా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీముద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రహత్ అలీ,ఇలియాస్ పటేల్,షకీల్, సిరాజ్ సలీం, కలీం,శంషోద్దీన్,ఖజామోహినొద్దీన్, ఖాజీమ్,ఖదీర్, దస్తగీర్, ఇక్రమోద్దీన్,వాజీద్ హుస్సేన్ ఫైజాన్, ముస్లిం యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే దినోత్సవ వేడుకలు



జయభేరి, దేవరకొండ :

స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు అంతర్జాతీయ కరాటే దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్ కరాటే మాస్టర్ శ్రీను తో మరియు సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ కరాటే దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్ మాట్లాడుతూ, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు, కళాకారులకు ఎప్పుడు అండగా ఉంటుందని, ఎన్నో సమాజసేవ కార్యక్రమాలలో ముందుంటూ ఎంతో మందిని జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి ఎంతో మందికి ఉపాధి కల్పించామని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు NVT, ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, డాన్స్ మాస్టర్ జగన్, లీగల్ అడ్వైజర్ ఉమేష్, రాపోల్ నిరంజన్, క్రీడాకారులు కళాకారులు చిన్నారులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న విద్యార్థి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



జయభేరి, దేవరకొండ:

పట్టణంలోని ఎన్ టి ఆర్ కాలనీ నివాసం ఉంటున్న అజ్మతుల్లా (పాషా బాయ్) స్వగృహంకి వెళ్లి బక్రీద్ సందర్భంగా బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు దేశంలో ప్రపంచంలో ఇస్లాం సభ్యులందరూ ఈ పండుగను జరుపుకుంటున్నారు. కులాలకు మతాలకు అతీతంగా మతసామరస్యంతో మహమ్మద్ ప్రవక్త బోధనాలకు అనుగుణంగా ప్రపంచ శాంతి అన్ని మతాల సారాంశం ఒకటే అని చెప్పిన విధంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజిక వేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్, జాతీయ అవార్డు గ్రహీతలు చోల్లేటి భాస్కరాచారి, రాసమల్ల నాగయ్య ముదిరాజ్, కూరెళ్ళ కృష్ణ చారి, రిపోర్టర్ పులిజాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

కుంద భానుచందర్



జయభేరి, మేడ్చల్:

పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి, చంపేసిన ఆ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ పట్టణ యువ నాయకుడు భానుచందర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఇలాంటి ఘోరాలకు పాల్పడిన వారిన వెంటనే ఉరి తీసే విధంగా కొత్త చట్టాలు తీసుకురా వాలని భానుచందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లాలో లైంగిక దాడికి గురై చనిపోయిన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

# కేటీఆర్ తప్పుడు అఫ్ఢడవిట్ పై ఫైట్





జయభేరి, హైదరాబాద్, జూన్ 17:

కేసీఆర్ కుటుంబ సభ్యులు ఒక్కొక్కరూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఇప్పటికే లిక్కర్ కేసులో తీహార్ జైలులో ఉన్న కవితకు తోడు కేసీఆర్ కు కూడా పవర్ కొనుగోళ్లపై నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్ ఆయన కొడుకు హిమాన్షు వంతు కూడా వచ్చింది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కేటీఆర్ ఎన్నిక చెల్లదంటూ కేటీఆర్ పై పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి కెకె మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్ లు విడివిడిగా కోర్టుకు పిటిషన్లు దాఖలు చేశారు. ఆయన తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని ఆరోపించారు. అఫిడవిట్ ప్రకారం తనపై భార్య, మైనర్ కుమార్తె మాత్రమే ఆధారపడ్డారని అఫిడవిట్లో కేటీఆర్ పేర్కొన్నారని, గత ఏడాది జులైలో మేజర్ అయిన కొడుకు హిమాన్షు తనపై ఆధారపడలేదని తెలిపారన్నారు. అయితే సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వెంకటాపూర్ లో 4 ఎకరాలు, ఎర్రవల్లిలో 32.15 ఎకరాలు కొనుగోలు చేసేందుకు హిమాన్షు వరుసగా రూ.10.50 లక్షలు, రూ.88.15 లక్షలు చెల్లించాడని , గత ఏడాది మేజర్ అయిన హిమాన్షుకు ఎవరి ఆర్థిక సహకారం లేకుండా అంత డబ్బు ఎలా వచ్చిందని ఆరోపించారు. అఫిడవిట్లో నిజాలు దాచిన కేటీఆర్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. వాదనల అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.వాస్తవానికి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు బీ ఫామ్ అందుకోవడమే ఆలస్యం నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడమే తరువాయి అనుకుంటే పొరపాటే. నామినేషన్ సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ విషయంలో జాగ్రత్త పడకపోతే చిక్కులు తప్పవు. అఫిడవిట్ లో రాసే ప్రతీ అక్షరం, పొందు పరిచే ప్రతీ విషయం ఆ అభ్యర్థిని నీడలా వెంటాడుతాయి. ఏమైనా పొరపాట్లు జరిగితే ఎన్నిక రద్దవ్వడమే కాదు ఆ తరువాత ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వీలుండదని హెచ్చరిస్తోంది కేంద్ర ఎన్నికల సంఘం.తాము ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అందుకే పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, తమపై ఉన్న కేసుల వివరాలను ఎన్నికల అధికారికి ఇవ్వడంతో పాటు మీడియా ద్వార ప్రజలకు తెలపాలన్నది ఈసీ నిబంధన. ఇదే ఇప్పుడు కేటీఆర్ అఫిడవిట్ విషయంలోనూ టెన్షన్ పెడుతోంది. ఒకవేళ ఏదైనా తప్పుడు సమాచారం దాస్తే.. ఆ తరువాత కోర్టు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెంతున్నారు. నామినేషన్ సందర్భంగా దాఖలుచేసే అఫిడవిట్ విషయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం సూచిస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ, అఫిడవిట్లలో చేసిన కొన్ని పొరపాట్లకు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. దీంతో ఈ సారి అలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడాలని ఎన్నికల ముందే ఈసీ అభ్యర్థులను హెచ్చరిస్తూ వస్తోంది.ఈ సారి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దాఖలు చేసే అఫిడవిట్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం. కఠిన నిబంధనలు విధించిన సంగతి విధితమే. అఫిడవిట్ లో ఏ ఒక్క కాలమ్ను నింపకుండా ఖాళీగా ఉంచవద్దని ఈసీ స్పష్టం చేసింది.

అభ్యర్థులు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు బహిరంగా తెలపాలనే నిబంధన సైతం 2013 నుంచి అమల్లోకి తెచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పోలింగ్కు రెండు రోజుల ముందుగా స్థానికంగా ఉన్న న్యూస్ పేపర్లు, న్యూచ్ ఛానల్స్లో ప్రకటనల ద్వారా క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు తెలపాల్సి ఉంటుంది. అది కూడా ఏ ముక్కూ మొఖం తెలియని పత్రికలు, ఛానల్స్లో కాకుండా ప్రముఖంగా కనిపించేలా మూడు సార్లు ప్రకటనలు ఇవ్వాలి. ఇలా ప్రజలకు అన్ని వివరాలను తెలియజేయకుండా ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్టయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసేందుకు లేదంటే గెలిచిన తరువాత అనర్హతకు గురవుతారని ఎన్నికల సంఘం తేల్చిచెప్పింది.ఇప్పుడు కేటీఆర్ వ్యవహారంలో ఒకవేళ తప్పుడు సమాచారం అని తేలితే ఏం జరగుతుందో అని పార్టీ వర్గాలు ఆందోళన పడుతున్నాయి. ఎన్నికల సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ లో తప్పులు ఉంటే తర్వాత తిప్పలు పడాల్సి వస్తుంది. 2023లో కొత్తగూడం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించారని ప్రత్యర్థులు కోర్టుకు వెళ్లడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెల్లడించారు. తర్వాత ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్రెడ్డి శాసనసభ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ అభ్యర్థి వినయ్కుమార్రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్రెడ్డి హైకోర్టుకు వెళ్లారు. అభ్యర్థులు ఫారం-26లో అన్ని రకాల వివరాలను పొందుపర్చాలి. ఇందులో ఆస్తి, కేసులు, లావాదేవీల వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయపరంగా చిక్కులు ఎదుర్కొవాల్సి ఉంటుంది.

# 30 లక్షలకు నీట్ అమ్మేశారు

జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 17:

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నీట్ యూజీ పేపర్ లీక్ అంశంలో తవ్వేకొద్దీ విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. బిహార్ కేంద్రంగా పేపర్ లీకేజీ జరిగినట్లు సిట్ విచారణలో తేలినట్లు జాతీయమీడియాలో కథనాలు వస్తున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీకైనట్లు వదంతులు రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(NTA) వాటిని తోసిపుచ్చింది. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్ను ఏర్పాటుచేసింది. సిట్ చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ చేసినందుకు కొందరు అభ్యర్థులు రూ.30 లక్షల చొప్పున చెల్లించినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బిహార్లో ఇప్పటివరకు 14 మందిని సిట్ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్నవారిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ గ్యాంగ్తో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు, కొందరు నీట్ అభ్యర్థుల కుటుంబసభ్యులతోనూ టచ్లో ఉన్నట్లు.. ఆ జూనియర్ ఇంజినీర్ విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోందిమే 4న బిహార్లోని రామకృష్ణనగర్ పోలీస్స్టేషన్ పరిధిలోని ఓ పాఠశాలలో ఈ ముఠా నకిలీ పరీక్ష సెషన్ను నిర్వహించింది. ఇక్కడ సమాధానాలతో కూడిన నీట్ ప్రశ్నపత్రాలను అభ్యర్థులకు పంపిణీ చేసింది. ఈ పేపర్ కోసం కొంతరు అభ్యర్థులు రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల వరకు ముడుపులు ఇచ్చారు. మొత్తం 35 మంది అభ్యర్థులకు ఈ ప్రశ్నాపత్రాలు అందాయి. అనంతరం ఆ ప్రశ్నాపత్రాలను అదే పాఠశాలలో కాల్చివేసినట్లు విచారణలో వెల్లడైందని జాతీయ మీడియా కథనాలు వస్తున్నాయి. విచారణలో భాగంగా నీట్ పేపర్ లీక్ అయినట్లు భావిస్తోన్న పాఠశాల నుంచి కాలిపోయిన ప్రశ్నపత్రం అవశేషాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. కేసుకు సంబంధించి విచారణ ముమ్మరంగా సాగుతోంది. మొత్తం 13 మంది నీట్ అభ్యర్థులు ఈ పేపర్ లీక్లో భాగస్వాములైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో నలుగురిని ఇప్పటికే అరెస్టు చేయగా.. మరో 9 మందికి తాజాగా నోటీసులు జారీ చేశారు. వీరు జూన్ 17, 18 తేదీల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. నీట్ పరీక్ష జరిగినప్పటి నుంచి అన్ని వివాదాలే కనిపిస్తున్నాయి. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు గ్రేస్ మార్కులు ఇవ్వడం, మరో కేంద్రంలో ఒక మీడియం బదులు మరో మీడియం ప్రశ్నపత్రం ఇవ్వడం ఇలా పరీక్ష రోజు నుంచి ఏదో ఒక వార్త వినిపిస్తూనే ఉంది. పేపర్ లీక్ వార్తలు కొట్టిపడేసిన కేంద్రం, ఎన్టీఏ.. వివాదం సుప్రీంకోర్టుకు చేరడంతో 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు రద్దు చేసింది. నీట్ ఫలితాల్లో అక్రమాలపై ఆరోపణలు రావడంతో.. స్పందించిన కేంద్రం వెంటనే నలుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని వేసింది. ఈ కమిటీ విచారణ జరిపి కేంద్రానికి నివేదిక సమర్పించింది. కమిటీ ఇచ్చిన నివేదికలోని నిర్ణయాలను కేంద్రం జూన్ 13న సుప్రీంకోర్టుకు వివరించింది. పరీక్ష సమయంలో కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేస్తున్నట్లు కోర్టుకు వెల్లడించింది. యూజీ పరీక్షను రద్దు చేయాలని, పరీక్ష నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకలపై న్యాయస్థానం పర్యవేక్షణలో సీబీఐ లేదా ఇతర స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. నీట్ పరీక్ష రాసినవారిలో 20 మంది విద్యార్థులు ఈ పిటిషన్ వేశారు. ఇప్పటికే నీట్ పరీక్షలో అక్రమాలపై సుప్రీంకోర్టుతో పాటు.. వివిధ హైకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

### సాల్వార్ గ్యాంగ్ పనే

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కావడం.. దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. బీహార్ రాజధాని పాట్నా కేంద్రంగా ఈ పేపర్ లీకేజీ జరిగిందని వార్తలు వినిపిస్తున్నాయి. కొన్ని జాతీయ మీడియా సంస్థలు పరిశోధనాత్మక కథనాలను ప్రసారం చేస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో సాల్వర్ గ్యాంగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సాల్వర్ గ్యాంగ్ ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ అంటే రాష్ట్రాలలో పోటీ పరీక్షల సమయంలో పేపర్ లీ కేజీలకు యత్నిస్తుంటాయి. అభ్యర్థుల వద్ద డబ్బులు వసూలు చేసి.. వారికి ఈ పేపర్లను అమ్ముతుంటాయి. రహస్య ప్రాంతాలలో ప్రశ్నలకు సమాధానాలు ఎప్పటికప్పుడు వల్లె వేయిస్తూ ఉంటాయి. తీరా పరీక్ష సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తుంటాయి. ఈ వ్యవహారాన్ని రెండవ కంటికి తెలియకుండా జరుపుతుంటాయి. ఈ గ్యాంగ్ కు జాతీయస్థాయిలో నెట్వర్క్ ఉంది.. ఉదాహరణకు నీట్ పరీక్షనే తీసుకుంటే.. పాట్నా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద సూపరింటెండెంట్ లకు భారీగా డబ్బు ఆశ చూపించారు. వారిని తమ వలలో వేసుకున్నారు. సూపరింటెండెంట్ లకు ప్రశ్న పత్రాలు చేతికి రాగానే వారు సాల్వర్ గ్యాంగ్ కు చేరవేశారు. ఆ ప్రశ్న పత్రాలను వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన వారితో పరిష్కరించి.. ఆ సమాధానాలను విద్యార్థులతో బట్టి కొట్టించారు. ఆ తర్వాత ఆ విద్యార్థులను నేరుగా పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకెళ్లి, పరీక్ష రాయించారు. హర్యానా లో ఒకే పరీక్ష కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు రావడం విశేషం. ఇందులో కొంతమంది విద్యార్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 717, 719 మార్కులు వేయడం అనుమానాలకు తావిస్తున్నది.ఈ సాల్వర్ గ్యాంగ్ ఇప్పుడు మాత్రమే కాదు, గతంలో బిహార్ టీచర్ రిక్రూట్ మెంట్ లోనూ ఇదే తీరుగా పని చేసింది. ఈ గ్యాంగ్ లో నితీష్ కుమార్ అనే వ్యక్తిని బీహార్ పోలీసులు పట్టుకున్నారు.

అయితే అతడిని విచారిస్తే.. నీట్ వ్యవహారం బయటపడింది. అయితే ఇందులో ఇంకా ఎన్ని పెద్ద తలకాయలు ఉన్నాయో అంతు పట్టడం లేదని బీహార్ పోలీసులు అంటున్నారు. మరోవైపు నీట్ పరీక్ష రద్దు చేసి, కొత్తగా నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి ఆదేశాలు ఇవ్వాలని.. 20 మంది విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. అంతేకాదు ఈ పరీక్షలో 620 కి మించి మార్కులు సాధించిన విద్యార్థుల నేపథ్యాన్ని పరిశీలించేందుకు ఒక స్వతంత్ర సంస్థతో పోస్ట్ ఎగ్జామ్ అనాలసిస్ నిర్వహించాలని వారు సుప్రీంకోర్టుకు విన్నవించారు..నీట్ పరీక్షలో అక్రమాల నేపథ్యంలో జూన్ 19, 20 తేదీలలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించేందుకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ పిలుపునివ్వడం విశేషం.



## సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

జయభేరి, ఘట్కేసర్ :

సామాజిక సేవ లక్ష్యంగా ఆపదలో ఉన్న నిరుపేదలను తమ సంస్థ నిరంతరం ఆదుకుంటుందని సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై సుందర్ రావు తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సి నగర్ లోని సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో డయాలసిస్ బాధితుడికి రూ. 15 వేల విలువ గల చెక్కును అందజేశారు. వరంగల్ జిల్లా, పాలకుర్తి మండలం, ముత్తారం గ్రామానికి చెందిన గ్యార సోమయ్యకు రెండు కిడ్నీలు పాడై ఉప్పల్ లోని టీ.ఎక్స్. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. 2 కిడ్నీలు పాడై జీవిత కాలం డయాలసిస్ చేసుకోవాల్సి ఉందని, అతని తక్షణ అవసరాల నిమిత్తం తమ సంస్థ ద్వారా రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. సామాజిక సేవ లక్ష్యంగా పనిచేస్తున్న తమ సంస్థలో సభ్యులై నిరుపేదలని ఆదుకునేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జంపాల రమేష్, సోమయ్య, ఐలయ్య, వీరారెడ్డి, దేవేందర్, లింగస్వామి, బంగారు బాబు, మల్లికార్జున రావు, వి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి దాతల సహకారం



జయభేరి, ఘట్కేసర్ :

పోచారం మున్సిపల్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సాయినగర్ కాలనీలో దాదాపు అంచనా వ్యాయం 1 లక్ష 30 వేల రూపాయలతో దాదాపు 3 వందల మీటర్ల భూగర్భ డ్రైనేజీను దాతల సహకారంతో నిర్మించగా దానిని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు అనంతరం దాతలు యేసు రత్నం దుర్గా సాగర్ రీఛార్డ్ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గారు మాట్లాడుతూ.. ఇలాగే మున్సిపల్ అభివృద్ధిలో మరికొందరు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు కాలనీవాసులు వెను మాధవ్, శ్రీనివాస్, నరేష్, వెంకట్ రెడ్డి, శ్రీరామ్ నరేష్,సుధాకర్, అలిబాయ్, కలనివసూలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇక మస్తు మజా!

టీ20 వరల్డ్ కప్‌లో సూపర్-8 బెర్తులు ఖరారు

నేటితో ముగియనున్న గ్రూప్ దశ

రెండు గ్రూపులుగా విడిపోనున్న జట్లు


ఈనెల 2 నుంచి క్రికెట్ అభిమానులను అలరిస్తున్న టీ20 వరల్డ్ కప్‌లో ఒక అంకం ముగిసింది! మంగళవారం వెస్టిండీస్‌అఫ్ఘానిస్థాన్ మ్యాచ్‌తో ఈ టోర్నీలో గ్రూప్ దశకు తెరపడనుంది. ఇప్పటికే సూపర్ 8 బెర్తులను ఖరారు చేసుకున్న 8 జట్లు.. రెండు గ్రూపులుగా విడిపోయి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఒక్కో గ్రూపులో 4 జట్లు.. 3 మ్యాచ్‌లు ఆడనుండగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు చేరతాయి.
మునుపెన్నడూ లేని విధంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలిసారిగా 20 జట్లతో వెస్టిండీస్/అమెరికా సంయుక్త వేదికలుగా నిర్వహిస్తున్న టీ20 వరల్డ్ కప్‌లో గ్రూప్ దశకు మంగళవారంతో శుభం కార్డు పడనుంది. సోమవారం బంగ్లాదేశ్.. నేపాల్‌ను ఓడించడంతో పాటు శ్రీలంక నెదర్లాండ్స్‌ను చిత్తు చేయడంతో బంగ్లా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించడంతో సూపర్ 8 బెర్తులు ఖరారయ్యాయి. దీంతో నేడు వెస్టిండీస్‌అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగే పోరు నామమాత్రమే.
బుధవారం నుంచి ఈ టోర్నీలో సూపర్ 8 పోరుకు తెరలేవనుంది. గ్రూప్ దశను విజయవంతంగా దాటిన 8 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయాయి. గ్రూప్ 1లో భారత్, ఆస్ట్రేలియా, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ ఉండగా గ్రూప్ 2 లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, యూఎస్ఏ ఉన్నాయి. ఈ దశలో ఒక జట్టు తమ గ్రూపులో ఉన్న మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచిన రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.
ఇకనుంచి ప్రతి జట్టుకూ ఆడబోయే ప్రతి మ్యాచ్ సవాలే కానుంది. పసికూనలు ఇచ్చిన షాకులు, కరేబియన్ గడ్డపై పిచ్‌లు స్పందిస్తున్న తీరును చూస్తే ఇకనుంచి టోర్నీ మరింత రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. గ్రూప్ దశలో పలు మ్యాచ్‌లకు అమెరికా ఆతిథ్యమిచ్చినా సూపర్ 8తో పాటు సెమీస్, ఫైనల్స్ విండీస్ లోనే జరుగుతాయి.
సూపర్ 8లో భారత్ కఠినమైన సవాళ్లనే ఎదుర్కోవాల్సి ఉంది. ఈనెల 20న అఫ్గాన్‌తో ఆడనున్న రోహిత్ సేన.. 22న బంగ్లాతో, 24న ఆస్ట్రేలియాతో తలపడుతుంది. గ్రూప్ దశలో అఫ్గాన్‌తో ఆడిన ఏ ప్రత్యర్థి కూడా మూడంకెల స్కోరు చేయలేదు. భారత ఐసీసీ ట్రోఫీ కలకు 'అడ్డుకట్ట' వేస్తున్న కంగారూలు మరోసారి కంగారు పెట్టేందుకూ సిద్ధమవుతున్న నేపథ్యంలో 'మెన్ ఇన్ బ్లూ' ఈ గండాన్ని ఎలా దాటుతుందనేది ఆసక్తికరం.
గ్రూప్ 1: భారత్, ఆస్ట్రేలియా, అఫ్గాన్థిన్, బంగ్లాదేశ్
గ్రూప్ 2: ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, యూఎస్ఏ



# పిల్లల ముందు తల్లిదండ్రులు గొడవ పడితే.. ఏం అవుతుందో తెలుసా..?

భార్యాభర్తల మధ్య గొడవ సాధారణం. అయితే పిల్లల ముందు మాత్రం గొడవలు పెట్టుకోకూడదు. వారి చిన్ని మనసుపై ఇది ఎంతో ప్రభావం చూపిస్తుంది.


భార్యాభర్తల గొడవల మధ్య కామన్. ఎందుకంటే అబ్బాయిలు, అమ్మాయిల ఆలోచనల్లో చాలా తేడాలు ఉంటాయి. ప్రతిసారీ ఒకరితో ఒకరు ఏకీభవించలేరు. అలాంటప్పుడు గొడవలు జరగడం సహజం. కానీ మీ పిల్లల ముందు మీరు గొడవపడటం ఎంతవరకు న్యాయం?
భార్యాభర్తలు ఇద్దరు ఉన్నప్పుడు బెడ్ రూములో గొడవపడితే పర్లేదు. గొడవ గది వెలుపలకు వచ్చి.. మీ పిల్లలను ప్రభావితం చేయకూడదు. చాలా సార్లు కొందరు భార్యాభర్తలు పోట్లాడుకునే స్థాయికి గొడవపడుతుంటారు. నోటి మాటతో కాకుండా ఒకరికొకరు చేతులతో సమాధానం చెబుతారు. వీటిని నేరుగా చూడటం వల్ల పిల్లల మనసుపై చాలా చెడు ప్రభావం పడుతుంది.
కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పిల్లలపై నిర్వహించిన అధ్యయనం ప్రకారం ముఖ్యమైన సమాచారం బయటకు వచ్చింది. తల్లిదండ్రులు ఎప్పుడూ గొడవపడే ఇంట్లో ఉండే పిల్లల్లో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ ఎక్కువగా ఉంటుంది. ప్రశాంతమైన కుటుంబంలోని పిల్లల్లో ఒత్తిడి హార్మోన్ తక్కువగా ఉంటుంది. కార్టిసాల్ ఎక్కువగా ఉన్న పిల్లవాడు అనారోగ్యానికి గురవుతాడు. ఇతరులతో సులభంగా కలవలేడు. ఆ పిల్లవాడు అందరితో అంత తేలిగ్గా కలిసిపోడు. కొంతమంది పిల్లలు చాలా కోపంగా ఉంటారు. ఇది ఇతర విద్యార్థులకు కూడా ప్రమాదకరం. తల్లిదండ్రుల వలన కూడా ఇలాంటి పరిస్థితి వస్తుంది.
తల్లితండ్రుల గొడవలతో పిల్లల మనసులో అభద్రతాభావం ఏర్పడవచ్చు. పిల్లల ముందు ఇలాంటి తల్లిదండ్రులు గొడవపడటం చూస్తుంటే మనసులో అభద్రతాభావం ఏర్పడి ఎవరిని నమ్మాలి, ఎవరిని అడగాలి అనే ఫీలింగ్ కలుగుతుంది. మనసులు చాలా త్వరగా పాడైపోతుంది.
తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లల ముందు ఒకరినొకరు నిందించుకుంటే అది పిల్లల మనసుపై ప్రభావం చూపుతుంది. తల్లిదండ్రులు సరైనవారు కాదనే భావన ఉండవచ్చు. తల్లిదండ్రులు తమ తల్లిదండ్రులను ఏ కారణం చేతనైనా గౌరవించకపోవచ్చు.
పిల్లవాడు స్కూల్ నుండి ఇంటికి రాగానే ఇంటి వాతావరణం సంతోషంగా ఉంటే, పిల్లవాడు బాగా ప్రాక్టీస్ చేస్తాడు. మంచి మానసిక స్థితిని కూడా అభివృద్ధి చేస్తాడు. రోజూ గొడవపడే తల్లిదండ్రులను చూసి పిల్లల మనసుపై ప్రతికూల ప్రభావం పడుతుంటే, ఆ పిల్లవాడు మరే ఇతర కార్యకలాపాల్లో పాల్గొనడు. పాఠశాల విద్య కూడా కుంటుపడుతుంది. ఇంటి వాతావరణం బాగుంటే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటాడు. కుటుంబంలో గొడవలు పెరిగినప్పుడు, అది పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఆరోగ్యమే కాదు శారీరక ఆరోగ్యం కూడా రోజురోజుకూ క్షీణిస్తుంది. ఇంట్లో ఎప్పుడూ గొడవలు పడుతూ ఉంటే, పిల్లవాడు సరిగ్గా తినడు, నిద్రపోడు లేదా తల్లితండ్రులు పిల్లలను పట్టించుకోలేరు. అటువంటి సందర్భంలో పిల్లవాడు దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడవచ్చు. డిప్రెషన్ వంటి మానసిక అనారోగ్యం పిల్లలపై ప్రభావం చూపుతుంది. పెద్దయ్యాక మరిన్ని సమస్యలు వస్తాయి.
తల్లితండ్రుల గొడవల వల్ల పిల్లల జీవితాలు నాశనమై మనసుపై చెడు ప్రభావం చూపుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడం మామూలే కానీ.. దానికి ఓ హద్దు ఉండాలి. పిల్లల ముందు గొడవ పడితే ఆ బిడ్డ భవిష్యత్తుకు సమస్యలే. పిల్లలను వారి ముందు ఉంచి కొట్లాటలు పెట్టుకోవడం ఏ కారణం చేతనైనా మంచిది కాదు. అది ఇంటి వాతావరణాన్ని పాడుచేయడమే కాకుండా పిల్లల ఆరోగ్యం, మనస్సు, పిల్లల మొత్తం భవిష్యత్తుపై చెడు ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోండి.



# రోజూ ఉదయం ఐస్ వాటర్‌లో కాసేపు ముఖం పెడితే చాలు..

మీ ముఖాన్ని ఐస్ వాటర్‌లో ముంచడం లేదా ఉదయాన్నే మీ చర్మానికి ఐస్ ప్యాక్‌లను అప్లై చేయడం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ చర్మానికి, మొత్తం శ్రేయస్సుకు సాయపడుతుంది.

ఐస్ వాటర్ మీ ముఖం మీద ఉబ్బినట్లుగా ఉంటే సాయపడుతుంది. అలాగే, ఇది మీకు వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. ఐస్ వాటర్ మీ ముఖాన్ని దృఢంగా, ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇంట్లో ఐస్ వాటర్ ఫేషియల్ చేయడం వల్ల మొటిమలను తగ్గించి, రంధ్రాలు, నల్లటి వలయాలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ ఉదయం చల్లటి నీటిలో మీ ముఖాన్ని నానబెట్టడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకోండి.
**వాపు తగ్గుతుంది :** ఐస్ వాటర్ రక్త నాళాలను సంకోచిస్తుంది, వాపును తగ్గిస్తుంది. ఇది కళ్ళు, ముఖం చుట్టూ వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మీరు ఉబ్బిన లేదా అలసటతో కనిపించే కళ్ళతో ఉదయం మేల్కొన్నప్పుడు ఇది ప్రత్యేకంగా సహాయపడుతుంది.
**మొటిమలు తగ్గుతాయి :** ఐస్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మంపై ఎరుపు, చికాకు, మంటను శాంతపరచడానికి సహాయపడతాయి. మీకు మొటిమలు, రోసేసియా, సన్‌బర్న్ వంటి పరిస్థితులు ఉంటే ఐస్‌ను అప్లై చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఎరుపు రంగును తగ్గిస్తుంది.
**మెరుగైన రక్త ప్రసరణ :** చల్లటి ఉష్ణోగ్రతలు చర్మానికి రక్త ప్రవాహాన్ని ప్రేరేపిస్తాయి. ఇది ఆరోగ్యకరమైన, గులాబీ రంగును ప్రోత్సహిస్తుంది. మెరుగైన రక్త ప్రసరణ చర్మ కణాలకు ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. వారి మొత్తం ఆరోగ్యం, శక్తిని మెరుగుపరుస్తుంది.
**చర్మ సంరక్షణ ఉత్పత్తులు :** ఐస్ వాటర్ చర్మ సంరక్షణ ఉత్పత్తులను మరింత ప్రభావవంతంగా గ్రహిస్తుంది. సీరమ్‌లు, మాయిశ్చరైజర్లు లేదా ఇతర చికిత్సలను వర్తించే ముందు మీ ముఖానికి ఐస్‌ను పూయడం ద్వారా మీరు వాటి వ్యాప్తి, ప్రభావాన్ని పెంచవచ్చు.
**నల్లటి వలయాలు :** చర్మంపై చల్లటి నీరు ఉత్తేజకరమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మీ ఇంద్రియాలను మేల్కొల్పుతుంది. సహజ శక్తిని పెంచుతుంది. ఉదయం మరింత మేల్కొని, రిఫ్రెష్‌గా ఉండటానికి సహాయం చేస్తుంది. కళ్ల కింద నల్లటి వలయాలను తగ్గిస్తుంది. కోల్డ్ కంప్రెస్‌లు రక్త నాళాలను కుదించి, కళ్ల కింద నల్లటి వలయాలను తగ్గించడంలో సహాయపడతాయి. రక్త ప్రసరణను మెరుగుపరచడం, ఉబ్బిన స్థితిని తగ్గించడం ద్వారా ఐస్ ప్యాక్ మీ కంటి కింద ఉన్న ప్రాంతాన్ని ప్రకాశవంతంగా, తాజాగా కనిపించేలా చేస్తుంది.
**ఐస్ మసాజ్ :** ఐస్ ప్యాక్ మసాజ్‌లు చర్మం నుండి టాక్సిన్స్, అదనపు ద్రవాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. ఇది కాలక్రమేణా స్పష్టమైన, ప్రకాశవంతమైన రంగుకు దోహదం చేస్తుంది.
వేడి వాతావరణంలో లేదా విరామం లేని రాత్రి తర్వాత మీ ముఖాన్ని మంచు నీటిలో ముంచడం వల్ల అసౌకర్యం నుండి తక్షణ ఉపశమనం పొందవచ్చు. రోజంతా మరింత అప్రమత్తంగా, శక్తివంతంగా ఉండటానికి మీకు సహాయపడుతుంది.
**సమస్యలు ఉంటే వద్దు :** ఐస్ వాటర్‌తో అందం కోసం చేసే పనులు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, అవి ప్రతి ఒక్కరికీ ప్రత్యేకించి ఉంటాయి. సున్నితమైన చర్మం లేదా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి అనుకూలంగా ఉండకపోవచ్చు. ఏదైనా కొత్త పద్ధతిని పాటించేముందు చర్మవ్యాధి నిపుణుడు సంప్రదించడం మంచిది. చర్మానికి ఐస్ ప్యాక్‌లను పూయడానికి ముందు మృదువైన గుడ్డలో చుట్టడంలాంటివి చేయాలి. నేరుగా అప్లై చేయకూడదు.






# తెలుగు సినిమా నాకు ప్రత్యేకం..



టాలీవుడ్‌పై అపారమైన ప్రేమను కురిపించేస్తున్నది అందాలభామ పూజాహెగ్డే. రీసెంట్‌గా సూర్య హీరోగా రూపొందుతోన్న ఓ తమిళ సినిమా ఛాన్స్‌ని కొట్టేసిన పూజా.. ఇటీవలే ఓ హిందీ సినిమాకు కూడా ఓకే చెప్పింది. తెలుగులో అవకాశాలు లేకపోయినా ఇతర భాషాల్లో అవకాశాలను సొంతం చేసుకుంటున్నది. ఇటీవల అభిమానులతో జరిపిన చిట్‌చాట్‌లో తెలుగు సినిమాపై ఎక్కడలేని ప్రేమని చూపించేసింది పూజా. అన్ని భాషల్లో నటిస్తున్నారు కదా.. నటిగా మీ ప్రయారిటీ ఏ భాషకిస్తారు? అనడిగితే.. 'నటనకు ప్రాంతీయబేధం లేదు. ఏ భాషలోనైనా నాకు కంఫర్‌ట్‌గానే ఉంటుంది. అయితే.. తెలుగు సినిమా నాకు ప్రత్యేకం. ఎందుకంటే.. నాకంటూ ఓ ఐడెంటిటీని ఇచ్చింది తెలుగు సినిమానే. నేను ఎన్ని భాషల్లో నటించినా.. తెలుగులో అవకాశం వస్తే మాత్రం కాస్త ఎక్కువ ఆనందిస్తా. త్వరలో తెలుగులో ఓ మంచి సినిమా చేస్తా.' అంటూ చెప్పుకొచ్చింది పూజా హెగ్డే.



# రేచెల్ ప్రతీకారం

వయోలెన్స్, బ్లడ్ షేడ్‌తో కూడిన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'రేచెల్'. హనీరోజ్ కథానాయిక. ఆనందిని బాలా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్, బ్రిడ్ షైన్ నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. హనీరోజ్ కొత్త అవతారాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. బాబురాజ్, కళాభవన్ షాజోన్, రోషన్ బషీర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: స్వరూప్ ఫిలిప్, సంగీతం: ఇషాన్ ఛబ్రా.

# పుష్ప ది రూల్

## విడుదల తేదీ ఇదే

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. కొన్ని రోజులుగా నెట్టింట చక్కర్లు కొడుతున్న పుకార్లే నిజమయ్యాయి. పుష్ప ది రూల్ ముందుగా నిర్ణయించిన ఆగస్టు 15న విడుదల కావడం లేదు. ఈ మూవీ కూడా పాత సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ..మళ్లీ డిసెంబర్ నెలలోనే విడుదల కానుంది. పుష్ప ది రూల్‌ను 2024 డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు తెలియజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ లాంఛ్ చేసిన కొత్త పోస్టర్‌లో కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తున్నాడు బన్నీ. 2021 డిసెంబర్ 17న విడుదలైన పుష్ప ది రైజ్ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబట్టింది. మరి సీక్వెల్ కూడా ఇదే లైన్‌లో వెళ్తుందా.. అనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా లాంఛ్ చేసిన పుష్ప పుష్ప సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. మరోవైపు రెండో సాంగ్ సూసేకి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. ఇటీవలే యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్, 1.67 మిలియన్లకుపైగా లైక్స్‌తో నంబర్ వన్ స్థానంలో ట్రెండింగ్‌లో నిలిచింది. పుష్ప ది రూల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# మాస్ టార్గెట్‌గా మిస్టర్ బచ్చన్

అగ్రహీరో రవితేజ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్‌శంకర్ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్ర నిర్మాణం పూర్తికావస్తున్నది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఓ షో రీల్ వీడియోను రిలీజ్ చేశారు. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌ని పరిచయం చేస్తూ ఈ వీడియో సాగింది. ఇందులో జగపతిబాబు కూడా ఓల్డ్ గెటప్పులో క్రూరమైన విలన్‌గా కనిపిస్తున్నారు. స్వతహాగా అమితాబ్ అభిమాని అయిన రవితేజా.. ఈ వీడియో చివర్లో బిగ్‌బీని ఇమిటేట్ చేస్తూ అభిమానుల్ని అలరించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో సచిన్ ఖేడేకర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com